## చిత్ర కథ పోటీ:

# వెంటాడే చిన్నతనం

టి. సీతాలక్ష్మి

గత సంచికలో ఇచ్చిన 'చిత్ర కథ పోటీ'కి అసంఖ్యాకంగా కథలు రావడం— మెచ్చుకోదగ్గ విషయం! వచ్చిన కథల్లో బాగున్నదనిపించిన కథ—'వెంటాడే చిన్న తనం' అన్న ఈ కథ. ఈ కథను రాసినవారు - టి. సీతాలక్ష్మి (కొత్తపల్లి) ప్రకటించిన ప్రకారం పంపుతామన్న 'బహుమతి'ని ఆమెకు పంపివేశాము.

కమలకి కష్టాలంటే చాలా బాగా తెలుసు. ఇప్పుడు కమలకి ఇరవై సంవత్సరాలైనా తన జీవితంలో జరిగిన సంఘటనలవల్ల ఆమె ఇప్పుడు ముప్పయి ఏళ్ళ జీవితానుభవం సంపాదించింది!

నెల రోజుల క్రితమే సవతి తల్లి మరణించింది. తండ్రి గుమస్తాగా పని చేస్తున్నాడు. ఇంటికి ఆడ దిక్కు కమలే అని చెప్పాలి. సవతి తల్లికి పిల్లలు లేని మూలంగా తోబుట్టువుల తోడు కూడా లేదు కమలకి. అందుకనే ఎప్పుడూ ఒంటరిగా కూర్చుని బాధ పడుతూ వుంటుంది.

తెల్లవారగానే లేచిన కమల తొందరగా తయారై బజారుకి బయలుదేరింది. ఉదయాన్నే టిఫిన్ చేయాలి తండ్రికి. ఇంట్లో గోధుమనూక కూడా లేదు. టిఫిన్ చేయకపోతే ఇంట్లో జరిగేరగడకి అంతులేదు. గబగబా అడుగులు వేస్తున్న కమలకి ఒకరింటి అరుగు మీద ఒక ఐదేళ్ళ పిల్ల కూర్చుని ఏడుస్తూ కనిపించింది. కమల ఆగింది.

జాలిగా ఆ పిల్లని చూసింది. ఆ అమ్మాయిని చూసిన కమలకి తన చిన్నతనంలో జరిగిన సంఘటన గుర్తుకి వచ్చింది....

ఆ రోజు కమల పుట్టిన రోజు. తల్లి బతికివున్న రోజులలో ఆ దినం ఆ పసిపిల్లకి అదొక పండగలా ఉండేది! కాని సవతి తల్లి ఆ విధంగా సాగనిచ్చేది కాదు. ఆ రోజు చివరికి హాయిగా బడికి కూడా పంపేదికాదు! ఇంట్లో వున్న మాసిన బట్టలన్నీ వేసి ఉతకమనో దొడ్డి అంతా వూడ్చమనో ఏదో విధంగా వంకబెట్టి స్కూల్ టైమ్ దాటిపోయేలా చూసేది. చివరికి మధ్యాన్నం దాటు వేసి అన్నం పెట్టేది. "పిన్నీ! ఈ రోజు నా పుట్టిన రోజు. మా అమ్మ నాకు పరమాన్నం వండి పెట్టేది" అంటూ అమాయకంగా ఆశగా అడిగేది కమల.

దాంతో ఛర్రుమనేది ఆమె. "నీ మొహానికి పుట్టిన రోజు కూడానా! నీ ఉసురే నాకు పిల్లలు లేకుండా చేసింది" అంటూ నాలుగు అంటించేది. చేసేది లేక అన్నం వదిలి వీధిలోనికి పోయి కూర్చుని వెక్కి వెక్కి ఏడ్చేది పాపం! ఈ విధంగా చిన్నతనం గుర్తు తెచ్చుకుంటే కమల కళ్ళల్లోకి నీళ్ళు వచ్చాయి.

ఇంతలో ఆ ఇంట్లో నుంచి ఒకామె వచ్చి వీధిలో కూర్చుని ఏడుస్తున్న పిల్లని చూచి "ఒసేయ్! దరిద్రపు మొఖమా! శుక్రవారం పూటా వీధి గుమ్మంలో కూర్చుని ఏడుస్తావేం?" అంటూ ఒక్క ఊపున క్రిందికి తోసేసింది! క్రింద పడిన ఆ పిల్ల బావురుమంటూ రోడ్డు మీదకి పరుగెత్తింది....

ఈ దృశ్యం చూపిన కమల అక్కడ నిలవలేక పోయింది! ఆ పిల్ల కూడా తనలాగే సవతి పిల్లా!! కమల గబగబా అడుగులు వేయసాగింది. "అమ్మో! నా చిన్నతనం మళ్ళీ నా వెనకే వస్తోంది" అంటూ భయభయంగా పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ నడవసాగింది కమల!

